సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 8 । జూలై । 2024



మనిషికో న్యాయం

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఆటవిక రాజ్యం సాగుతోంది. రోజుకో ఘటన బయటపడుతోంది.

- 8లో



పడవ బోల్తా..

పడవ బోల్తా పడి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. బారువ కొత్తూరు తీరం వద్ద ఘటన జరిగింది.


- 8లో

ఎంసీఏ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఎంసీఏ కోర్సు మూడో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. 37 మంది పరీక్షకు హాజరు కాగా, 36 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్ అవసరమైన విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ జయంతి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి పార్టీ నాయ కులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమం అనంతరం మీడియా సమావేశం ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీసెట్–2024 ఇంజినీరింగ్ ఎంపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ వెరిఫికేషన్ కొనసాగుతోంది. నోటిఫికేషన్ మేరకు ఫీజు చెల్లింపు ప్రక్రియ ముగిసింది. ఈ నెల 10వ తేదీ వరకు సర్టిఫికెట్ల అప్‌లోడ్, వెరిఫికేషన్ కొనసాగుతుంది. సోమవారం నుంచి 12వ తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. 13న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చారు. 16న సీట్ల అలాట్‌మెంట్, 17 నుంచి సీట్లు లభించిన కళాశాలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. రిపోర్టింగ్‌కు 22వ తేదీ ఆఖరు తేదీ, 19 నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభం కానుంది. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కాలేజీల్లో 3360 సీట్లు ఉన్నాయి. విద్యార్థులు రాష్ట్రం యూనిట్‌గా కళాశాలలు, బ్రాంచ్‌లు ఎంపిక చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ఎంపిక ఆధారంగా ర్యాంకు, రిజర్వేషన్‌లు పరిగణనలోకి తీసుకొని సీట్లు కేటాయిస్తారు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల పరిశీలన



ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

పలాస: పలాస మండలం రేగులపాడు గ్రామం వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార అధికారులతో మాట్లాడుతూ పనులు ఏ స్థాయిలో ఉన్నాయనే విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను కొత్తగా వచ్చానని వివరాలు తెలుసుకుంటున్నానని, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఎస్ఈ రాంబాబు, డీఈలు వెంకటకృష్ణ, కె.ధనుంజయ, రాజశేఖర్, టీడీపీ నాయకులు వజ్జ బాబూరా వు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు డాక్టరు వి.దుర్గారావు, కొరికాన శంకర్, డొక్కర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మదన గోపాలసాగరం పరిశీలన

టెక్కలి: టెక్కలి సమీపంలో గల మదనగోపాల సాగరాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం పరిశీలించారు. మొత్తం విస్తీర్ణం, ఆయకట్టు వివరాలను తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు రైతులతో పాటు శివారు ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సాగునీరు అందజేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన తోపాటు వంశధార ఈఈ శేఖర్‌బాబు సిబ్బంది ఉన్నారు.

పిల్లలూ.. జాగ్రత్త



వెన్నెలవలసలో హాస్టల్ విద్యార్థిని మలేరియాతో చనిపోయింది. దుప్పలవలస అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులంతా కడుపునొప్పితో అల్లాడిపోతున్నారు. కోటబొమ్మాళి కేజీబీవీలో 22 మంది విద్యార్థినులు కడుపు నొప్పి, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారు. అంతకంటే ముందు శ్రీకాకుళంలోని గిరిజన హాస్టల్‌లో డయేరియా ప్రబలింది. అధికారులపై నమ్మకం ఉంచి హాస్టల్‌కు పంపిస్తున్న తల్లిదండ్రులకు ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.



కోటబొమ్మాళి ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ బోడ్డేపల్లి మీనాక్షి, ఏపీసీ జయప్రకాష్

- జిల్లాలోని పలు హాస్టళ్లలో వెలుగు చూస్తున్న డయేరియా, మలేరియా కేసులు
- మొన్న దుప్పలవలస, నిన్న శ్రీకాకుళం, కోటబొమ్మాళి, నేడు వెన్నెలవలస హాస్టళ్లలో విద్యార్థులకు అస్వస్థత
- మలేరియాతో వెన్నెలవలస హాస్టల్ విద్యార్థిని మృతి

అరసవల్లి:

వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రమాదకర పరిస్థితులు హెచ్చరికలు పంపిస్తున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రాణాల మీదకు వస్తోందని చెబుతున్నాయి. మొన్న దుప్పలవలస, నిన్న శ్రీకాకుళం, కోటబొమ్మాళి, నేడు వెన్నెలవలస హాస్టళ్లలో విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. వెన్నెలవలసలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బిడ్డిక రిష్మిత అనే ఎనిమిదేళ్ల చిన్నారి మలేరియా బారిన పడి ప్రాణాలు కోల్పోయింది. ఇక్కడే మరో నలుగురు మలేరియాతో బాధ పడుతున్నారు. అంతకు ముందు చూస్తే ఎచ్చెర్ల మండలం దుప్పలవలస బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, శ్రీకాకుళంలో గిరిజన హాస్టల్‌లో కూడా పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తర్వాత మళ్లీ కోటబొమ్మాళి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు కూడా డయేరియా బారిన పడ్డారు. వీరిలో చాలా మంది కడుపు నొప్పి, విరేచనాల లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరాల్సి వచ్చింది. ఫుడ్ పాయిజన్ వల్ల ఇలా జరిగిందని వసతి గృహ అధికారులు చెబుతుంటే.. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు మాత్రం తాగునీరు, తీసుకున్న ఫుడ్ మెటీరియల్స్‌ను టెస్టులు చేస్తున్నారు. మరోవైపు వసతి గృహాల్లో మంచినీటి ట్యాంకులు, ఆర్వో ట్యాంకులు శుభ్రంగా లేకపోవడం కూడా ఓ కారణమని తెలుస్తోంది. కోటబొమ్మాళిలో ఆర్వో ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే ఇదంతా జరిగిందని స్పష్టమవుతోంది.

మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు తలెత్తిన ఆరోగ్య సమస్యలు అదుపులోకి వస్తున్నాయి. పాఠశాలలో వైద్య శిబిరం ఆదివారం కొనసాగింది. మరో రెండు రోజులు వైద్య శిబిరం విద్యార్థులకు అందుబాటులో ఉంచనున్నారు. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎన్.శేషగిరి ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కొత్త కేసులు లేకపోగా, బాధితులు సైతం కోలుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టినట్లు పిన్సిపాల్ బోర బుచ్చిరాజు చెప్పారు.

జిల్లాలో కాంప్లికేటెడ్ డయేరియా కేసులు

జిల్లాలో వరుసగా విద్యార్థులు డయేరియా బారిన పడుతున్నారు. ఇప్పటికే దుప్పలవలస, శ్రీకాకుళం, కోటబొమ్మాళిలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేశాం. సుమారు 12 మంది వరకు పాజిటివ్‌గా తేలింది. వెన్నెలవలసలో మలేరియా ఉంది. కాంప్లికేటెడ్ డయారియా కేసులు ఎక్కువవుతున్నాయి. ఇది ఆందోళన కలిగిస్తున్న అంశం. తాగునీటి వనరుల్లో కలుషిత లక్షణాలతో విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నారు. వెన్నెలవలసలో ఓ విద్యార్థిని మలేరియాతో చనిపోయింది.

– డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

ఇంత జరుగుతున్నా..

హాస్టల్ విద్యార్థులు ఒక్కొక్కరిగా అనారోగ్యం బారిన పడుతూ ఉంటే నాయకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన, ఆశ్రమ, బీసీ, గురుకుల హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని తాజా ఘటనలు నిరూపిస్తున్నాయి. వసతి గృహాల్లో దోమతెరలు, చుట్టూ పరిసరాల పారిశుద్ధ్యం, తాగునీరు, తినే ఆహారం ఇతరత్రా అంశాలను పట్టించుకోవాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి నెల రోజులు దాటుతున్నా ఈ పరిస్థితులపై దృష్టి సారించడం లేదనే వాదనలూ వినిపిస్తున్నాయి.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా

- వెన్నెలవలస గిరిజన పాఠశాల అధికారులపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం
- బాలిక మృతిపై కలెక్టర్‌కు నివేదిక



ఆశ్రమ పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

సరుబుజ్జిలి: గిరిజన బాలికల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారా.. అంటూ డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, ఏఎన్‌ఎంపై మండిపడ్డారు. పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలిక బిడ్డిక రిష్మిత మలేరియా జ్వరంతో శనివారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందింది. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సమయానికి హెచ్‌ఎం, వార్డెన్, అధ్యాపకులు విధులకు హాజరు కాలేదు. అప్పటికే 9 గంటలు కావస్తోంది. విద్యార్థినులు అల్పాహారం చేస్తున్నారు. ఆ తర్వాత విధులకు హాజరైన హెచ్‌ఎం, వార్డెన్లను డీఎంహెచ్‌ఓ ప్రశ్నించారు. పిల్లల అల్పాహారం సమయంలో కూడా మీరు లేకపోవడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. తల్లిదండ్రులు మీ పై నమ్మకంతో ఇక్కడ వదిలితే ఇంత చిన్న చూపు చూస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల వద్ద దోమతెరలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించగా.. అధికారులు బిక్క ముఖం వేశారు. కొందరు ఇంటికి పట్టుకెళ్లినట్లు, మరికొందరు తమ వద్ద ఉన్నట్లు చెప్పడంతో డీఎంహెచ్‌ఓ అసహనం వ్యక్తం చేశారు. 280 మంది బాలికలు ఉన్న పాఠశాలకు రాత్రి వేళల్లో పూర్తిగా రక్షణ కొరవడినట్లు తెలుస్తోందని అన్నారు.

పారిశుద్ధ్య లోపంపై ఆగ్రహం

పాఠశాల ఆవరణ పారిశుద్ధ్య లోపంపై డీఎంహెచ్‌ఓ తీవ్రంగా మండిపడ్డారు. పిల్లలు ప్లేట్లు, చేతులు శుభ్రం చేసుకొనే ప్రదేశంలో కుళ్లిన ఆహారపదార్థాలు, అన్నం, వ్యర్థ పదార్థాలు డ్రమ్ముల్లో నిల్వచేయడం మంచి పద్ధతి కాదని వంట నిర్వాహకులను హెచ్చరించారు. పిల్లలందరికీ వేడినీరు అందించాలని సూచించారు. ప్రతి రోజు పాఠశాలలో వైద్య పరీక్షలు చేయాలన్నారు. గిరిజన హాస్టళ్లలో మలేరియా దోమల నివారణ మందు పిచికారీ తరుచూ చేస్తుండాలన్నారు. రిష్మిత మృతిపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, స్థానిక వైద్యులు సంతోష్‌కుమార్, సాహితి ప్రియదర్శిని పాల్గొన్నారు.

కోటబొమ్మాళికి అధికారుల బృందం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కేజీబీవీలో డయేరియా ప్రబలడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. అధికారులు పరిశీలించి సమగ్ర నివేదిక అందించాలని కోరారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, జిల్లా సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రోణంకి జయప్రకాష్ కేజీబీవీలో సమగ్ర విచారణ చేపట్టారు. స్థానిక సిబ్బందితో పాటు విద్యార్థినుల నుంచి సమాచారం సేకరించారు. వంట మనుషులు, పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి ఫిర్యాదు చేయడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ పూట వంట ఆ పూటే చేసి వడ్డించాల ని ఆదేశించారు. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు పరిశీలించి వాటి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సామాజిక ఆస్పత్రికి వెళ్లి అక్కడ విద్యార్థులను పరామర్శించారు. సంఘటన జరిగిన రోజు తీసుకున్న ఆహారంపై ఆరా తీశారు. వారం రోజుల పాటు కేజీబీవీలో మాంసం, గుడ్లు వండకూడదని, కేవలం శాకాహారమే అందించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది పాఠశాల ఆవరణలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ఆదివారం నాడు కొత్తగా మరో విద్యార్థినికి డయేరియా లక్షణాలు కనిపించడంతో ఆమెను సామాజిక ఆస్పత్రిలో చేర్చారు. స్థానిక ఎంఈఓలు ఎస్.అప్పలరాజు, లఖినేని విశ్వప్రతాప్, రెవెన్యూ డీ టీ ఆర్.మధు, ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్‌ఓ టి. రాము జిల్లా అధికారుల వెంట ఉన్నారు. అయితే విద్యార్థినులను ఒక్కరోజులోనే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసేశారు. దీనిపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

కబళించిన మలేరియా



రిష్మిత (ఫైల్)

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న బిడ్డిక రిష్మిత(8) మలేరియాతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి తర్వాత మృతి చెందింది. అదే హాస్టల్‌లో మరో నలుగురు మలేరియాతో బాధ పడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మన్యం జిల్లా సీతంపేట మండలం అచ్చబ గ్రామానికి చెందిన రిష్మిత ఇటీవల పాఠశాల తరగతులకు హాజరైంది. ఆ సమయంలో రిష్మితతోపాటు, సవర ప్రభావతికి కూడా తీవ్ర జ్వరం రావడంతో సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి సమాచారం అందించారు. వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారి సంతోష్ కుమార్ బాలికలను రిమ్స్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రిష్మిత మృతి చెందింది. దీంతో ఆదివారం విద్యార్థినులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందులో సవర స్వప్న, కొండగొర్రి రిబిక, సవర అంజలిలకు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. ఒక్కసారిగా మలేరియా ప్రబలడంతో విద్యార్థినుల తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కదిలినాడు చూడరో..

జగన్నాథ రథ చక్రాలు కదిలాయి. భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథాలు గుండిచా మందిరాలకు చేరుకున్నాయి. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస తదితర ప్రాంతాల్లో రథ యాత్ర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

– టెక్కలి, కాశీబుగ్గ, శ్రీకాకుళం కల్చరల్



టెక్కలిలో జగన్నాథుని రథాన్ని ముందుకు లాగుతున్న యువకులు



శ్రీకాకుళంలోని బొందిలీపురంలో ఊరేగింపు



కాశీబుగ్గలోని జగన్నాథ రథయాత్రకు పోటెత్తిన భక్తులు

10న ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10వ తేదీన క్యాంపస్ డ్రైవ్ (జాబ్‌మేళా) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 15 వేలు నుంచి రూ.18 వేల మధ్య వేతనం లభిస్తుందని అన్నారు. ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్సు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నెల్లూరుకు చెందిన ఆల్‌స్టోమ్, సుజూ మోటీర్స్, ఇన్‌ఫ్లీమ్ ఇంగియా లిమిటెడ్, అనంతపురానికి చెందిన హుండై, ఏసీటీ, తిరుపతికి చెందిన డిక్సన్ మొత్తం 8 పరిశ్రమల ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అర్హత ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుందని వివరించారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు



డిగ్రీ కళాశాల

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024/25 విద్యా సంవత్సరానికి పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు రెండు మంజూరయ్యాయని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ పి.లత తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ కెమిస్ట్రీ కోర్సులు మంజూరయ్యాయని తెలిపారు. దీనికి సంబంధించిన అఫిలియేషన్ ప్రక్రియపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అధికారులతో చర్చించి తగిన అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంఎస్సీ కంప్యూటర్స్, కెమిస్ట్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాస్టల్ సౌకర్యం కూడా ఉందని అన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీపీజీసీఈటీలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

వంటశాల భవనం కూల్చి స్థలం ఆక్రమణ



రాత్రికి రాత్రి జేసీబీతో కూల్చివేసిన గాజులకొల్లివలస పాఠశాల వంటశాల భవనం

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గతంలో నిర్మించిన వంటశాల భవనాన్ని ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కూల్చివేశారు. శనివారం అర్ధరాత్రి జేసీబీతో దాన్ని కూల్చేసి ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని సర్పంచ్ మొండేటి కూర్మారావు ఆదివారం తెలిపారు. ఈ ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకోవాలని కోరారు. పాఠశాల ఆవరణలో వంటశాల భవనం కూల్చివేసిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

మూడు ఇసుక లారీలు సీజ్

జలుమూరు: దొంపాక గ్రామం వంశధార నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను ఆదివారం ఉదయం పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన వేపల సూరిబాబు, జగన్నాథరావు, లోడిగల రాంబాబులకు చెందిన లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కిడ్నీ పరిశోధన కేంద్రం సందర్శన



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న అజశర్మ, నాయకులు

కాశీబుగ్గ: ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ ఉద్దాన ప్రాంతంలో ఉన్న కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 మంది డాక్టర్లు ప్రత్యేక నిపుణులు ఆరుగురు ఉండాలని చెబుతున్న 102 జీఓను యథాతథంగా అమలు చేయాలని కోరారు. వ్యాధి మూలాలు కనుగొనే నిపుణులను నియమించి పూర్తి నివారణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ప్రజా సంఘాల నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యిల గణపతి, బి.సుగుణవతి, జన్ని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా స్టీమ్ ఇంజిన్



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆవరణలో స్టీమ్ ఇంజిన్

పర్లాకిమిడి: బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నడిచిన పి.ఎల్.ఐ.ట్రెన్ ఇంజిను పర్లాకిమిడిలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం సందర్శనకు ఉంచారు. విషయం తెలుసుకున్న స్థానికులు రైల్వేస్టేషన్‌కు విచ్చేసి పాత స్టీం ఇంజిన్ వద్ద సెల్ఫీలు దిగుతున్నారు.

మనిషికో న్యాయం..

- పూడివలసలో సర్పంచ్ వినియోగిస్తున్నారన్న అక్కసుతో బోరు బావి మోటార్ తొలగింపు
- టీడీపీ నాయకుల మోటార్లపై కానరాని చర్యలు
- సాక్షాత్తు సర్పంచ్ ఫిర్యాదు చేసినా స్పందన కరువు



సర్పంచ్ తాగునీటికి వినియోగిస్తున్న మోటార్, పైపులు తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రోజుకో కుట్ర జరుగుతోంది. అధికారులు సైతం కూటమి నాయకుల మాటలకు బెదిరిపోతున్నారు. కొందరు సెలవులు పెడుతుండగా, మరికొందరు ఏకంగా రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమైపోతున్నారు. ఎచ్చెర్ల మండలం పూడివలసలో బోరు బావులు, మంచినీటి నేల బావులకు ఏడుగురు ప్రైవేట్ వ్యక్తులు మోటార్లు అమర్చారు. ఇందులో సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు ఒక బోరు బావికి మోటారు అమర్చారు. విద్యుత్ బిల్లు ఆయనే చెల్లిస్తున్నారు. ఇక్కడ ఓపెన్‌గా పైపెట్టి వదిలేశారు. స్థానికంగా 30 కుటుంబాల వరకు ఈ బోరు నుంచి నీటిని వినియోగిస్తున్నాయి. మరో పక్క గ్రామంలో కూటమి నాయకులు కూడా ఆరు బోర్లు పెట్టి వ్యక్తిగతంగా నీటిని వినియోగిస్తున్నారు. ఇళ్ల ట్యాంకులకు ప్లంబింగ్ చేసి రన్నింగ్ సప్లై సౌకర్యం కల్పించుకున్నారు కూడా. అయితే సర్పంచ్‌తోపాటు అక్కడి వారు ఉపయోగిస్తున్న బోరుకు ఉన్న మోటార్ తొలగించాలని నేరుగా కొందరు ఎమ్మెల్యేకు లేఖ రాశారు. జూన్ 27న మాజీ సర్పంచ్ గొలివి గోవిందరావు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు ఫిర్యాదు చేయగా, ఈ బోరు తొలగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆగమేఘాలపై ఏఈ డి.హేమలత విచారణ నిర్వహించి జూన్ 28న మోటారు తొలగించేశారు. ఇదే క్రమంలో గ్రామంలో కూటమి నాయకులు వినియోగిస్తున్న ఆరు అక్రమ మోటార్లపై సర్పంచ్ జరగుళ్ల కృష్ణారావు ఎంపీడీఓ ఆర్.రమాదేవికి జూన్ 29న ఫిర్యాదు చేశారు. ఈ మోటార్లు సైతం తొలగించాలని ఎంపీడీఓ గ్రామకార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. కానీ ఎమ్మెల్యే బెదిరింపులతో ఆయన తన విధులు నిర్వర్తించలేకపోయారు.

సర్పంచ్ ఫిర్యాదుకు న్యాయం చేయలేకపోవటం, ఎంపీడీఓ ఆదేశాలు పాటించలేకపోవటం, కూటమి ఎమ్మెల్యే బెదిరింపు వంటి అంశాలతో మానసిక ఆందోళన చెందిన గ్రామ కార్యదర్శి సనపల సీతారాంరాజు జూలై ఒకటి నుంచి మూడు వరకు సెలవు పెట్టారు. దీర్ఘకాలిక సెలవుకు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీంతో జూలై రెండో తేదీన వ్యక్తిగత కారణాలు అంటూ రాజీనామా చేసేశారు.



ప్రభుత్వ బావికి టీడీపీ నాయకుడు పెట్టిన మోటారు

ఎంపీడీఓ, డీపీఓలకు రాజీనామా లేఖ అందజేశారు. అయిలే ఫార్మేట్ సక్రమంగా లేదంటూ అధికారులు పెండింగ్‌లో ఉంచారు. మరో పక్క జూలై ఒకటి నుంచి పూడివలస గ్రామంలో గ్రామ కార్యదర్శి లేరు. ఇన్‌చార్జిని సైతం నియమించలేదు. ఎంపీడీఓ ఆర్.రమాదేవి సైతం ఈ నెల 10 వరకు సెలవు పెట్టారు.

అందరికీ ఒకే న్యాయం చేయాలి

గ్రామ పాలనలో కీలకమైన సర్పంచ్ ఫిర్యాదుకే స్పందన లేదు. మాజీ సర్పంచ్ ఫిర్యాదుకు మాత్రం గంటల్లో స్పందించారు. నేను స్థానిక ప్రజల అవసరాల కోసమే మోటారు ఏర్పాటు చేశాను. టీడీపీ నాయకులు వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారు. అయినా వారి మోటార్లు తొలగించలేదు. ఉన్నతాధికారులు దీనిపై స్పందించాలి.

– జరుగుళ్ల కృష్ణారావు, సర్పంచ్, పూడివలస

అయ్యో.. రైతన్నా



వర్షం లేకపోవడంతో ఎండిపోతున్న వరి నారు (ఇన్‌సెట్లో) ఎండిపోయిన బాహుదానది

- అడుగంటిన బాహుదా నది
- వరుణుడు కరుణిస్తేనే పంటలు

ఇచ్ఛాపురం రూరల్:

బాహుదా పరివాహక ప్రాంత రైతులు గడ్డు కాలం ఎదుర్కొంటున్నారు. వీరికి బాహుదా పరవళ్లు తొక్కితేనే పంటలు మెండుగా పండుతాయి. ఈ ఏడాది పట్టుమని పది నిమిషాలు కూడా వర్షం కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఒడిశా నుంచి 10 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న బాహుదా నది 30 గ్రామాలకు తాగునీటితో పాటు ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు నిండు కుండలా దర్శనమిచ్చే బాహుదా నది ఇప్పుడు బావురుమంటోంది. ఈ ఏడాది వరుణుడు కరుణిస్తే గానీ ఇక్కడి రైతు బతికి బట్టకట్టలేడు. ఇప్పటికే వేసిన నారుమడులు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో 11 ఓపెన్ హెడ్ ఛానెళ్ల మరమ్మత్తులు చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఓపెన్ హెడ్ చానెళ్లు బాగు చేయాలి



ఇటువైపు సరైన వర్షాలు లేవు. తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయిన 11 ఓపెన్ హెడ్ చానెళ్లను నూతన ప్రభుత్వం పునరుద్ధరించాలి. అదే విధంగా బాహుదానదిలో ఇసుక తవ్వకాలు నిలపడంతో పాటు నదిలో పేరుకు పోయిన ముళ్ల పొదల్ని తొలగించాలి.

– దక్కత నూకయ్యరెడ్డి,చైర్మన్, మండల వ్యవసాయ సలహా సంఘం, ఇచ్ఛాపురం మండలం

'కూటమి హామీలు నిలబెట్టుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్నికలకు ముందు కూటమి తరపున హామీలు ఇచ్చిన నారా లోకేష్ 117 జీఓను రద్దు చేయాలని పీఆర్‌టీయూ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు, ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు విజ్ఞప్తి చేశారు. పీఆర్‌టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు తంగి మురళీమోహన్‌రావు అధ్యక్షతన ఆదివారం శ్రీకాకుళం అరసవల్లి సమీపంలోని పీఆర్‌టీయూ నూతన భవన కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్‌టీయూ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావు, రాష్ట్ర సహాధ్యక్షులు పి.రాజశేఖరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరణం సీతరాజు, నర్సింహమూర్తి తదితరులు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా 1 నుంచి 5వ తరగతి వరకు అక్కడే తరగతులు నిర్వహించేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్ సమస్యని పరిష్కరించి, కామన్ సీనియారిటీతో ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వెంటనే పీఆర్సీ ప్రకటించాలి..

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చే పీఆర్సీని వెంటనే ప్రకటించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే ఇవ్వలేని పక్షంలో ఐఆర్‌ను తక్షణమే ప్రకటించి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు భాషకు ప్రాధాన్యతను కొనసాగిస్తూ.. ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలని విన్నవించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై జిల్లా, మండలశాఖల ప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘ ప్రతినిధులు బి.రవికుమార్, కె.ఇందిర, జనార్ధనరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ



సూర్యనమస్కారాల పూజలు చేస్తున్న దృశ్యం



ఆలయంలో గ్రూప్–1 అధికారుల బృందం

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతివ్వడంతో ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఈ ఒక్కరోజున వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల నుంచి రూ.2,60,800, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.30 లక్షలు, విరాళాల ద్వారా రూ. 69,813 వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

గ్రూప్–1 అధికారుల బృందం

2023 గ్రూప్–1 క్యాడర్ అధికారుల బృందం ఆదివారం ఆదిత్యుడిని దర్శించుకున్నారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారులు పోలుమహంతి మనోజ్, ప్రదీప్, మల్లికార్జున, జిల్లా ఫైర్ అధికారులు ఎస్.రేణుకయ్య, పోలుమహంతి సాయిరాజేష్, అసిస్టెంట్ కమిషనర్లు జ్ఞానానందరెడ్డి, సురేంద్రరెడ్డి, రాకేష్, భార్గవ్ తదితరులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ చంద్రశేఖర్, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వీరికి ప్రసాదాలను ఆదిత్యుని జ్ఞాపికలను అందజేశారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు పైడి వేణుగోపాలం డిమాండ్ చేశారు. బీజేపీ యువ మోర్చా శ్రీకాకుళం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవలి పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ హిందువులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు శ్రీకాకుళంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను భారతీయ జనతా యువ మోర్చా తీవ్రంగా ఖండిస్తుందని, హిందూ సమాజం మనోభావాలు దెబ్బ తినే విధంగా చేసిన వ్యాఖ్యలకుగాను ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆట్జాడ రవిబాబ్జీ, పేడాడ సుప్రియ, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు మదన్‌మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజకుమార్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా కోశాధికారి అప్పలరాజు, సురేష్ సింగ్, రావాడ రాజశేఖర్, దీపు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో మన క్రీడాకారుల హవా



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ ఎల్.ఈశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ నేషనల్స్ పెన్‌కాక్ సిలాట్ మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. పాండిచ్చేరిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 6,7 తేదీల్లో 5వ సౌత్‌జోన్ నేషనల్స్ బాలబాలికల పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు నాలుగు బంగారు, మూడు రజత, రెండు కాంస్య పతకాలు కలిపి మొత్తం తొమ్మిది పతకాలు సాధించి మెరిశారు. ఇందులో కె.హరీష్, డి.సుమన, కె.హాసిని, డి.సుచెరిత బంగారు పతకాలు సాధించగా, బి.జ్యోతిసాయిప్రసాద్, బి.ప్రణవి, బి.మిథున్ రజత పతకాలు, ఎల్.లతీష్‌చైతన్య, బి.వెంకట్‌మేహుల్ కాంస్య పతకాలు సాధించి శభాష్ అనిపించారు. వీరంతా రణస్థలం పరిసర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు. జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడంపై జిల్లా పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షులు రేగడి దయామయ, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్‌నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. రణస్థలంలోని కొండములగాంకు చెందిన కోచ్ లింగాల ఈశ్వరరావు శిక్షణలో వీరంతా తర్ఫీదు పొందారని చెప్పారు. ఈ పోటీలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించినట్టు లక్ష్మణ్‌నాయుడు చెప్పారు. కోచ్ ఈశ్వరరావు, క్రీడాకారులను వారు అభినందించారు.

గిరిజనుడికి ఇంటి నిర్మాణం



సతివాడలో జయలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు



చిన్నబగ్గలో గిరిజనుడికి నిర్మించి ఇచ్చిన ఇల్లు

కొత్తూరు: కొత్తూరుకు చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సీతంపేట మండలం చిన్నబగ్గ గిరిజన గ్రామానికి చెందిన ఆరిక త్రినాథరావుకు ఉన్న పురిపాక ఇటీవల వీచిన ఈదురు గాలులకు శిథిలమైంది. ఈ విషయం భగత్ సింగ్ ట్రస్టు సభ్యుల దృష్టికి రావడంతో పలువురు విరాళాలు సేకరించి కొత్త ఇల్లు కట్టి ఇచ్చారు. ఇంటికి విద్యుత్ సదుపాయం కూడా కల్పించారు. ఈ గిరిజన కుటుంబానికి దుప్పట్లతో పాటు వస్త్రాలను కొత్తూరుకు చెందిన జడ్డు రామకృష్ణ అందజేశారు.

అలాగే పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల సతివాడ గ్రామానికి చెందిన పున్నాన జయలక్ష్మి భర్త మృతి చెందడంతో ఆమె కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. విశాఖ పూర్ణ మార్కెట్‌లో నోటి కేన్సర్‌తో బాధ పడుతున్న చంద్ర అనే మహిళకు కూడా రూ.15వేలు సాయం చేశారు.

• వరుణ దేవా కరుణించవయ్యా..



వానలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ పెద్దబొడ్డపాడులో ఆదివారం దాసుడు దుంపల నారాయణ సమక్షంలో 'వరద పాయసం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిసరాల్లో ఉన్న కొండపైకి గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడికి ముర్రాటలు, ప్రసాదాలు సమర్పించారు.

– వజ్రపుకొత్తూరు రూరల్, వజ్రపుకొత్తూరు

పడవ బోల్తా.. మత్స్యకారుడు మృతి



సముద్ర తీరంలో జోగారావు మృతదేహం



జోగారావు (ఫైల్)

సోంపేట: మండలంలోని వాడపాలేం గ్రామానికి చెందిన మత్స్యకారుడు పలిశెట్టి జోగారావు (48) సముద్రంలో వేటకు వెళ్లి ఆదివారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గ్రామస్తులు, తోటి మత్స్యకారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం వాడపాలేం గ్రామానికి చెందిన మత్స్యకారులు పలిశెట్టి జోగారావు, చెక్క దానయ్య, చెక్క సింహాచలం, బడే కుమార్‌స్వామి, బుడగట్ల బాస్కర్ వేటకు వెళ్లారు. బారువ కొత్తూరు తీరం వద్ద అలల తాకిడి ఉండడంతో తెప్ప బోర్లా పడి జోగారావు మృతి చెందినట్లు తోటి మత్స్యకారులు తెలిపారు. జోగారావుకు భార్య పార్వతి, కుమారుడు రాజు, కుమార్తె లక్ష్మి ఉన్నారు. జోగారావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రభుత్వం జోగారావు కుటుంబాన్ని ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.